క్లుప్తంగా

నింద్ర తహసీల్దార్‌గా భగవతి


భగవతి

నింద్ర: మండల తహసీల్దార్‌గా భగవతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ బదిలీపై చిత్తూరుకు వెళ్లారు. దీంతో జిల్లా కేంద్రంలో పని చేస్తున్న భగవతిని నింద్రకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రేషన్ సక్రమంగా అందించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

పుత్తూరు రూరల్: రేషన్‌కార్డుదారులకు బియ్యం సకాలంలో సక్రమంగా అందించాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని వడమాలపేట తహసీల్దార్ సుబ్రమణ్యం స్పష్టం చేశారు. మంగళవారం డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల మోతాదును విధిగా పాటించాలన్నారు. బియ్యం పంపిణీ తేదీలను ముందస్తుగా కార్డుదారులకు తెలియజేయాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. మండలం నుంచి రేషన్ బియ్యం తమిళనాడుకు తరలిస్తున్నట్లు సమాచారం అందుతోందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను ఎవరు అతిక్రమించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రబీకి అన్నదాత సిద్ధం


కాళికాపురంలో పొలాన్ని దుక్కులు చేస్తున్న రైతు

విజయపురం (నగరి) : మండలంలో రైతులు రబీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు వరినాట్లు వేయగా, మరికొందరు వేరుశనగకు పొలాలను దుక్కి దున్ని చదును చేస్తున్నారు. గత నెల రోజులుగా మంచి వర్షం పడింది. దీంతో బోరు, బావుల్లో సైతం నీటి మట్టం పెరిగింది. అంతేగాకుండా చెరువులు పూర్తి నిండాయి. ప్రధానంగా పన్నూరు, మంగళం చెరువు కట్ట కింద రైతులు వందల ఎకరాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది వరి సాగు పెరిగే అవకాశం ఉంది.

పాడిరైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏసీఓ మహేశ్వరెడ్డి

పాలసముద్రం : పాడిపశువులకు సోకే వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి భానుప్రసాద్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో శ్రీజ మహిళా మిల్క్ డెయిరీ ఏసీఓ ఈ.మహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చి పాడిరైతులకు వారు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్న రైతులు సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. టీకాలు వేయడం ద్వారా పాల దిగుబడి తగ్గదన్నారు. అనంతరం పశువులకు అందించే క్యాల్షియం, మినరల్‌మిక్చర్‌ను తక్కువ ధరకు అందించారు. ఈ సందర్భంగా 55 పాడిపశువులకు వైద్య పరీక్షలు చేసి పిరుదు మందులు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మారీ, రీగన్, చంద్రబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

అర్హులైన వారిని పర్మినెంట్ చేయాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నగరి : అర్హులైన పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. నగరి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన ఆయన మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అర్హులైన పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తానని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు బాషా, శేఖర్, విజయకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి, సతీష్, రాజేంద్ర, పార్వతీ, ఎల్లమ్మ వెంకటమ్మ పాల్గొన్నారు.

ఔషధాల ప్రభావంపై వర్క్‌షాప్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో ప్రతికూల ఔషధ ప్రతిచర్యలు, నివారణ అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ పి.లక్ష్మీ ఔషధ ప్రతికూల చర్యలు, గుర్తించే ప్రక్రియ, సమాజంపై వాటి ప్రభావం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సూపర్ సక్సెస్

- కిటకిటలాడుతున్న వైద్య శిబిరాలు
- తరలి వస్తున్న ప్రజలే నిలువెత్తు నిదర్శనం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా


తిరుమణ్యం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: నిండు మనస్సుతో ముఖ్యమంత్రి జగనన్న తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సూపర్ సక్సెస్ అని, కిటకిటలాడుతున్న వైద్య శిబిరాలు, పెద్ద సంఖ్యలో తరలి వస్తున్న ప్రజలే ఇందుకు నిలువెత్తు నిదర్శనమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం వడమాలపేట మండలం తిరుమణ్యం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రి రోజా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న ధృఢ సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలను చూస్తే ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రజల మేలు కోసం అనుక్షణం పనిచేస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు మాటలకు మాత్రమే పరిమితమన్నారు. చెప్పింది, చెప్పనిదీ చేసి చూపుతున్న ఏకైక నాయకుడు, పాలకుడు జగనన్న మాత్రమేనని స్పష్టం చేశారు. ఇలాంటి సీఎం మనకు ఉండడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు.

మంచి చేసే ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి..

మంచి చేసే ప్రభుత్వాన్ని మళ్లీ నిలబెట్టుకోవలసిన బాధ్యత ప్రజలపైనే ఉందని మంత్రి రోజా తెలిపారు. ఒక్క వైద్య రంగంలోనే నేటి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సేవలను తెలుసుకుంటే ఆశ్చర్యం వేయక మానదన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా గడచిన నాలుగేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత కంటి చికిత్సతో పాటు ఉచిత కంటి అద్దాల పంపిణీ కోసం రూ.13 కోట్లు కేటాయించినట్లు వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను, 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. చికిత్స తర్వాత విశ్రాంతి సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1004 కోట్లతో 16.19 లక్షల మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు. 108 సేవల కింద 768 అత్యవసర అంబులెన్స్‌లు, 910 మొబైల్ క్లినిక్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. వైద్య చదువుల కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్ల ఖర్చుతో కొత్తగా 17 మెడికల్ కాలేజీలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కోసం నాలుగేళ్లలో రూ.6,687 కోట్ల తో 35 లక్షల మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు. వైద్య శాఖలో డాక్టర్ల నుంచి నర్సుల వరకు 50 వేలకు పైగా నియామకాలు జరిగినట్లు వెల్లడించారు. అనంతరం హెల్త్ కార్డులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మస్తానమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, కిరణ్, సురేష్‌రాజు, నందయ్య, సుధాకర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, దీపక్, మునిబాబు, రాజశేఖర్, రవి, మునెమ్మ, కమలమ్మ, రవిరెడ్డి, శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.


మెడికల్ కిట్ పంపిణీ చేస్తున్న మంత్రి రోజా


వైద్య సేవలు పొందడానికి తరలి వచ్చిన ప్రజలు

పిల్లల కడుపు మాడుస్తారా ?


డైట్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న గోరుముద్దలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ లత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) ఆవరణలో ఉన్న ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద అమలు చేస్తోందన్నారు. కానీ వంట కార్మికులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ముద్ద కట్టిన భోజనం అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం చాలీచాలని పచ్చళ్లతో పిల్లల కడుపు మాడుస్తారా ? అని ప్రశ్నించారు. మీ పిల్లలకు ఇలాగే వండి పెడతారా అని కార్మికులను నిలదీశారు. భోజనం తయారీలో నాణ్యత పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేశారు. అలాగే పాఠశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగంగా దేశమ్మ ఆలయ నిర్మాణం


నిర్మాణంలో ఉన్న దేశమ్మ ఆలయం

నగరి : నగరి మున్సిపాలిటీ, టీఆర్ కండ్రిగలో నేత్ర దేవతగా ప్రసిద్ధి చెందిన దేశమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం వేగంగా జరుగుతోంది. రూ.1.20 కోట్ల నిధులతో పునర్నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణంలో భాగంగా గోపురం, ముఖమండపం, గర్భగుడి, పోతురాజ ఆలయం పనులు వేగంగా జరుగుతున్నాయి.

శరవేగంగా అభివృద్ధి పనులు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పెనుమూరు మండలం గత నాలుగు సంవత్సర కాలంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో మండలం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. పురాతన ఆలయం కనిగిరి కొండను టీటీడీలో విలీనం చేసి ఆలయ అభివృద్ధికి రూ.2.5 కోట్లతో వెచ్చించి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చిన ఘనత ఉప ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అనంతరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదా రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.13.50 లక్షలతో 50 పడకల ఆస్పత్రి మంజూరు చేసిన ఘనత కూడా డిప్యూటీ సీఎందే అన్నారు. అదేవిధంగా రూ.84 లక్షలతో బస్టాండ్ నిర్మాణానికి మంజూరు చేశారన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, మండల యువత అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు మధురెడ్డి, బాల, మురళిరెడ్డి, జయచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, ఎంపీటీసీ జమున పాల్గొన్నారు.


టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

13న సత్యవేడులో మెగా జాబ్ మేళా

పిచ్చాటూరు: సత్యవేడులో ఈనెల 13న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే పిచ్చాటూరు విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు ఉదయం 9 గంటలకు సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాలలో జరుగనున్న జాబ్ మేళాలో 15 బహుళ జాతి కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. 8వ తరగతి/ 10వ తరగతి, ఇంటర్/ఏదైనా డిప్లొమో/ఏదైనా డిగ్రీ/ బీటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, 5 బయోడేటా కాపీలు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13 వేలు నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి 9440374535, 9154449677 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

ప్రత్యేక ప్రతిభావంతులను గౌరవించాలి



మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: ప్రత్యేక ప్రతిభావంతుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవ మర్యాదలు చూపాలని పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర సూచించారు. మంగళవారం స్థానిక మదర్ థెరిసా దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రజలు మానసిన వికలాంగత్వం కలిగిన వారికి తగిన తోడ్పాటు అందించాలని కోరారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం మానసిక ఆరోగ్యం పట్ల అన్ని దేశాలు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపిందని చెప్పారు. ఏటా అక్టోబర్ 10న మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులు ఉచిత న్యాయ సహాయానికి అర్హులని తెలిపారు. వారి తల్లిదండ్రులు సైతం తమ బాధ్యతను విస్మరించరాదని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు కె.శివయ్య, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప

పాలసముద్రం : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో కృష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘ అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరుకు సాగు చేస్తే, తద్వారా వచ్చే బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తనం నుంచి కోత వరకు ద్రవ, ఘన జీవామృతం, కషాయాలతో పండించే వారికి అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు కిచెన్ గార్డెన్‌పై వివరించారు. వరిపంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని సూచించారు. అలాగే ద్రావణం తయారీ గురించి తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష

- ప్రజల ఆయుష్షు పెంచడానికే జగనన్న ఆరోగ్య సురక్ష
- డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత

కార్వేటినగరం: ప్రజల ఆయుష్షును పెంచడానికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ లతతో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడానికి రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. శిబిరంలో 570 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. అలాగే వారిలో కొందరిని మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కంటి వైద్య పరీక్షలు చేసుకున్న వారికి కంటి అద్దాలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి శిబిరానికి విచ్చేసిన పలువురు రోగులకు బీపీ చెక్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శేషాద్రి, ఎంపీటీసీ వెంకటేష్, వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని శెట్టివానత్తం సచివాలయ పరిధిలోని ఎగువ శెట్టివానత్తం గ్రామంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ధనంజయ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 489 మంది రోగులను పరీక్షించి, అర్హత గల 83 మందికి కంటి అద్దాలను అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అధికారుల, నాయకులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని జిల్లా జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండలంలోని కలిజవేడు సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా రోగులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు ఇన్బనాథన్, ఎంపీడీఓ సుధాకర్, వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి అందించడానికే..

పాలసముద్రం : మండలంలోని తిరుమళరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో సర్పంచ్ జీవిత ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 238 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వారిలో తొమ్మిది మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతాస్పత్రులకు రెఫర్ చేశారు. కంటి చూపు సమస్య ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు. మండలంలో మంగళవారంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా ముగియడంపై కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివ ప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని దేవరగుడిపల్లెలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ 302 మందికి వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పురుషోత్తం, సర్పంచ్ ఆశీర్వాదం, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, తిరుమలయ్యపల్లె డీడీఓ కేశవులు, పంచాయతీ కార్యదర్శి మధు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు


ఎగువశెట్టివానత్తం గ్రామంలో కంటి అద్దాలను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు




దేవరగుడిపల్లెలో.., పాలసముద్రం: జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతంపై కేక్ కట్ చేస్తున్న వైద్యసిబ్బంది, నాయకులు, పాలసముద్రంలో..

పరిశ్రమల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన


కంపెనీని సందర్శించిన విద్యార్థుల బృందం

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులకు పరిశ్రమల నిర్వహణ, పనితీరుపై అవగాహన కల్పించారు. మంగళవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పారిశ్రామిక సందర్శన కార్యక్రమం నిర్వహించారు. నారాయణవనంలోని తసా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వెళ్లి యంత్రాల పనితీరు, మేనేజ్‌మెంట్ పనితీరును పరిశీలించారు. కంపెనీ మేనేజర్ మురుగేశ్ మాట్లాడుతూ కంపెనీ నిర్వహణ, సిబ్బంది పనివిధానం, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. అధ్యాపకుడు తిరుమలయ్య పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు కళాశాలల్లో చదివే పాఠ్యాంశాల్లోని అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుమలయ్య, దేవకి, వాసవి, గంగయ్య, లక్ష్మి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.